

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



పొట్టేలు ధర రూ. 1.36 లక్షలు



రూ.1.36 లక్షలకు పొట్టేలును కొనుగోలు చేసిన కోసిగి వ్యక్తి చింతలగేని నర్సారెడ్డి

కోసిగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కయ్యానికి కాలుదువ్వేలా ఉన్న ఈ పొట్టేలు ధర అక్షరాలా లక్షా ముప్పై ఆరు వేల రూపాయలు. కోసిగి చెందిన చింతలగేని నర్సారెడ్డి అనే వ్యక్తి కోసిగిలో జరిగే దేవర కోసం కర్ణాటక రాష్ట్రం భాగల్‌కోటకు వెళ్లి అక్కడి సంతలో రూ.1.36 లక్షలు వెచ్చించి ఈ పొట్టేలును కొనుగోలు చేశాడు. భారీ ధర పలికిన ఈ పొట్టేలును చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

వలస పక్షుల సందడి

ఆహార అన్వేషణలో
వలస పక్షులు
పల్లె పల్లెల్లో
పచ్చని పంట పొలాల్లో
కిలకిల రావాలతో
కనువిందు చేసిన
కొంగల గుంపు
నువ్వా నేనా అంటూ
పోటీ పడుతూ
పైపైకి ఎగురుతూ
ఆహ్లాదకర వాతావరణంలో
స్వేచ్ఛగా విహరిస్తూ
సేదదీరుతూ
ఆహారాన్ని అన్వేషిస్తూ
సందడి చేసిన
శ్వేతవర్ణ పక్షులు

-చాగలమర్రి/ రుద్రవరం (ఆంధ్రజ్యోతి)



చాగలమర్రి: శెట్టివీడు గ్రామ సమీపంలోని జొన్న పంటలో ఆహారాన్ని అన్వేషిస్తున్న కొంగలు



రుద్రవరం: లింగందిన్నె గ్రామ సమీపంలోని పొలాల్లో సందడి చేస్తున్న వలస పక్షులు

కాలువలు ఇలా నీరు పారేదెలా..?

సాగునీరు ఆయకట్టుకు చేరాలి.. పుట్టకొలది ధాన్యం పండాలి.. రైతు ఇంట సిరులు కురవాలి.. అప్పుడే కదా కష్టజీవుల మోమున దరహాసం కనిపించేది. పంటలు పండాలంటే పొలాల్లోకి నీరు పారాలి. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం అన్నదాతల జీవనాడులైన ప్రాజెక్టులు, పంట కాలువలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటర్లు, కాలువలు అస్తవ్యస్తంగా మారి, చాలా ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. ముళ్ల పొదలతో నిండిపోయాయి. చివరి ఆయకట్టుకు సాగు నీరు అందని ద్రాక్షగా మారింది. మట్టి మనుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో కాలువ నిర్వహణ, మరమ్మతులపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికలు ముగియడంతో ప్రపంచ బ్యాంక్ నిధులు వచ్చే అవకాశం ఉంది. కాల్వలు అభివృద్ధి చెందుతాయని రైతులు ఆశిస్తు న్నారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 6.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించా ల్సిన తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ, జీడీపీ కాలువ దుస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కోసిగి మండలంలో ముళ్ల పొదలతో ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్





ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు వద్ద అసంపూర్తిగా టీబీపీ ఎల్లెల్సీ లైనింగ్ పనులు

- వైసీపీ హయాంలో కాలువలను గాలికొదిలేశారు
- మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రావడంతో నిర్వహణపై దృష్టి
- పీఎంకేఎస్‌వై, ప్రపంచ బ్యాంక్ నిధుల కోసం ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లాలో 6.56 లక్షల ఎకరాల ఆయకట్టు
- మరమ్మతులకు అవసరమైన నిధుల అంచనా రూ.1,558 కోట్లు
- అస్థవ్యస్తంగా టీబీపీ ఎల్లెల్సీ, కేసీ కెనాల్, తెలుగుగంగ, జీడీపీ పంట కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు

కర్నూలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, కర్నూలు-కడప (కేసీ) కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్సార్బీసీ) ప్రధాన సాగు, తాగునీటి వనరులు ఉన్నాయి. ఆయా కాలువ పరిధిలో 6.30 లక్షల ఎకరాలకు సాగు నీరు, వివిధ గ్రామాలకు తాగు నీరు అందించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాకు రాయలసీమ జిల్లాకు సాగు నీరు అందించే జలవనరుల హబ్‌గా ఉంది. అయితే.. దశాబ్దాలుగా కాలువ మరమ్మతులపై ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. రాష్ట్ర విభజన తరువాత చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు నిధులతో కొంత వరకు తాత్కాలిక మరమ్మతులు చేసింది. 2019లో జగన్ సారథ్యంలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కాలువలు, ప్రాజెక్టు నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. పొలాలకు నీరుపారుదల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు శిథిలావస్థకు చేరాయి. పలు ప్రాంతాల్లో పూడిక, ముళ్ల పొదలు, జమ్ముతో నిండిపోయాయి. నీళ్ల రాకపోవడంతో కాలువలను రైతులు పూడ్చేసిన పల్లెసీమలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ ఏర్పాటు కావడం రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీలు, కాలువలు ఆధునికీకరణకు ప్రపంచ బ్యాంకు నిధులు ఇవ్వాలంటే సాగునీటి ఎన్నికలు జరపాలి, తొమ్మిదేళ్ల తరువాత టీడీపీ ప్రభుత్వం నీటి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసింది, డబ్ల్యూయూఏ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ), ప్రాజెక్టు కమిటీ (పీసీ)లకు పాలకవర్గాలను ఎన్నుకున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఆయకట్టుకు జీవనాడులైన కాలువలు, డిస్ట్రిబ్యూటర్లు ఆధునికీకరణ, మరమ్మతులకు ఆయా నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

పీఎంకేఎస్‌వై, ప్రపంచ బ్యాంకు నిధులపై ఆశలు

ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), ప్రపంచ బ్యాంక్ నిధులతో కాలువల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయమని ఇప్పటికే జలవనరుల శాఖ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. పీఎంకేఎస్‌వై రిపేర్స్-రెనోవేషన్-రిస్టోరేషన్ (ఆర్ఆర్ఆర్)లో భాగంగా మేజర్, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువలు, సిస్టమ్ ట్యాంకులు శాశ్వత మరమ్మతులు, ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు తయారు చేయమని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు (గైడ్‌లైన్స్) కూడా రూపొందించారు. 2012-16 మధ్యలో పీఎంకేఎస్‌వై-ట్రిపుల్ ఆర్ కింద జిల్లాకు రూ.21 కోట్ల నిధులు మంజూరైతే రూ.12 కోట్లు మాత్రమే ఖర్చు చేశాం. అప్పుడు మైనర్ ఇగిరేషన్ చెరువులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు. తాజాగా తాగునీటి అవసరాలు తీర్చే మేజరు ప్రాజెక్టులు కూడా ట్రిపుల్‌ఆర్ కింద చేర్చడం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కాలువలు, ప్రాజెక్టులు, చెరువులు ఆధునికీకరణ, పునర్నిర్మాణం చేసేందుకు అవకాశం ఏర్పడిందని ఓ ఇంజనీరు పేర్కొన్నారు. అదే క్రమంలో కాలువల మరమ్మతులకు ఒక్కో డబ్ల్యూయూఏకు ప్రపంచ బ్యాంకు నిధులు సరాసరి రూ.20 లక్షలు ఖర్చు చేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు అంటున్నారు. కాలువలకు జలజీవం రావాలంటే డబ్ల్యూయూఏ, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు రాబట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిధులు.. నీళ్ల కోసం పోరాడి రైతుల నమ్మకాన్ని నిజబెడుతారా..? అలంకార ప్రాయంతగా మారుతారా..? అన్నది తేలలాంటే వేచి చూడాల్సిందే.



రుద్రవరం సమీపంలో కోతకు గురైన తెలుగుగంగ కాలువ 20వ బ్లాక్ ఛానల్

మిగతా 7లో..

ప్రతివారం ఒక నాటకం

ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



కళాకారులతో ఏపీ నాటక అకాడమీ చైర్మన్, పక్కన ఎమ్మెల్యేలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'చంద్రన్న వరం ప్రతివారం ఒక నాటకం' పేరుతో రాష్ట్రంలోని రంగస్థల కళాకారులు ప్రతి శనివారం ఒక నాటకం ప్రదర్శించేలా చేసి వారిని ఆదుకుంటామని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తెలిపారు. నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో ఆదివారం సాయంత్రం ఉమ్మడి జిల్లా రంగస్థల కళాకారుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఏపీ నాటక అకాడమీలో ప్రతి రిజిస్టరు కళాసంస్థ తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వారికి దశల వారీగా ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి కళాకారుడికి పింఛన్, ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా కళాకారులకు ఆర్థిక సాయం అందించే ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారుల సంఘం అధ్యక్షుడు మహాలింగప్ప, జిల్లా రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు పి.దస్తగిరి, విశ్వకళా సమితి అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, హరికథ కళాకారిణి మంజుల, రంగం సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, సీనియర్ కళాకారులు వీవీ రమణారెడ్డి, ఖాదర్ బాబు తదితరులు చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు.

నేడు 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని కోసిగి మండలంలోని దొడ్డి గ్రామం, మంత్రాలయం మండలంలోని దిబ్బనదొడ్డి గ్రామం, పెద్దకడుబూరు మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదోని మండలంలోని బలదూరు, ఎడవలి, కౌతాళం మండంలోని కరణి, తిప్పలదొడ్డిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలంలోని హుశేనాపురం, గూడూరు మండలంలోని గూడూరు, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని దేవనకొండ మండలం తెర్నేకల్లు, వెల్దుర్తి మొత్తం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

- జిల్లాలో 201 పోస్టులు ఖాళీ
- వచ్చే నెల 5న రాత పరీక్ష

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హేతుబద్ధీకరణ ద్వారా నూతనంగా ఏర్పడిన చౌకదుకాణాలకు, వివిధ రకాల కారణాలతో ఖాళీ ఏర్పడిన చౌక దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామక భర్తీ నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. ఈ మేరకు సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ, కర్నూలు రెవెన్యూ డివిజన్ అధికారులకు నేరుగా కానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ ఈ నెల 30న సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు సంబంధిత మండల తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో లభిస్తాయని చెప్పారు. డీలర్ల రాత పరీక్ష జనవరి 5న నిర్వహించనున్నట్లు తెలిపారు. రేషన్ డీలర్ల ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు డివిజన్ పరిధిలోని సి.బెళగల్ మండలం-6, గూడూరు-4, కల్లూరు-6, కోడుమూరు-12, కర్నూలు-6, కర్నూలు అర్బన్-31, ఓర్వకల్లు-2, వెల్దుర్తి-9 ఉన్నాయి. అలాగే పత్తికొండ డివిజన్ పరిధిలోని ఆలూరు-13, ఆస్పరి-3, దేవనకొండ-4, హాలహర్వి-5, క్రిష్ణగిరి-2, మద్దికెర తూర్పు-2, పత్తికొండ-12, తుగ్గలి-4 ఉన్నాయి. ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోనిలో 32, గోనెగండ్ల-3, హోళగుంద-2, కోసిగి-10, కౌతాళం-4, మంత్రాలయం-12, నందవరం-2, పెద్దకడుబూరు-9, ఎమ్మిగనూరు-6 డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అమిత్ షా రాజీనామా చేయాలి

- కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా నేడు నగరంలో ర్యాలీ
- డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షా వెంటనే పార్టీకి, పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషాతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన అమిత్‌షాకు హోంమంత్రిగా కొనసాగే హక్కు లేదన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే మూడు పర్యాయాలు హోంమంత్రిగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం బాబా సాహెబ్ అంబేడ్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని రాజ్‌విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని, ఆ పత్రాన్ని రాష్ట్రపతికి పంపాలని కోరతామని చెప్పారు. షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని నిర్మించిన ప్రపంచ మేధావి అంబేడ్కర్‌కు అవమానం దారుణమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, అనంతరత్నం మాదిగ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం క్షేత్రానికి భక్తు లు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తుల రద్దీతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి దాదాపు నాలుగు గంటల సమయం పటింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదు రుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు చేశారు. దేవస్థానం అధికారులు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ అందజేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆయా సదుపా యాలను కల్పించేందుకు దేవస్థానం కార్యాలయం సిబ్బం దికి ప్రత్యేక విధులను కేటాయించారు.


కాలనీవాసుల రాకపోకలకు అడ్డంగా నిర్మించిన ప్రహరీ

అక్రమంగా గోడలు కట్టేశారు..!

- ప్రజలు వెళ్లకుండా నాలుగు దారులను మూసేశారు
- సీసీ రోడ్డును ధ్వసం చేసిన వైనం
- ఆదోనిలో వైసీపీ నాయకుడి బరితెగింపు

సంపన్నుల నివాసం ఉండే ఇళ్ల మధ్యలో స్లమ్ ఏరియా ఉండకూడదని, వారు అటూ ఇటూ తిరగకూడదన్న ఉద్దేశంతో ఏకంగా ఓ వైసీపీ నాయకుడు అడ్డంగా వారం రోజుల క్రితం రాత్రికి రాత్రే గోడలు కట్టేశారు. దర్జాగా మున్సిపల్ ఓపెన్ స్థలంలో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి కాలనీవాసుల రాకపోకల కోసం వేసిన సీసీ రహదారిని ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించారు. ఈ ఘటన ఆదోని పట్టణంలోని మహాత్మాగాంధీ నగర్ సమీపంలోని ఓ ఎస్టేట్‌లో వెలుగులోకి వచ్చింది.

ఆదోని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ శివారు ప్రాంతంలోని రైల్వే లైన్ సమీపంలో మహాత్మాగాంధీ నగర్ కాలనీ సమీపంలో ఓ ఎస్టేట్ వెలిసింది. వైసీపీకి చెందిన ఓ నాయకుడు ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దాదాపు 60 సెంట్ల వరకు మున్సిపల్ ఓపెన్ సైట్‌గా ఉంచారు. వైసీపీ నాయకుడు వేసిన ప్లాట్ల స్థలం పక్కన స్లమ్ ఏరియా ఉండటంతో ఆయన ప్లాట్లకు ధర పడిపోతుందన్న నెపంతో ఓపెన్ సైట్‌లో ఆ ప్రాంతవాసులు రాకుండా అడ్డంగా ప్రహరీని నిర్మించేశాడు.


వైసీపీ నాయకుడు ధ్వంసం చేసిన సీసీ రోడ్డు

స్థలం విలువ పెంచుకోవడానికి..

మహాత్మాగాంధీ నగర్‌లోని కాలనీవాసులు కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో చాల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ మాస్ ఏరియా కిందనే గుర్తిస్తున్నారు. వైసీపీ నాయకుడు వేసిన ప్లాట్లకు ధర తగ్గుతుందన్న ఉద్దేశంతో ఇటు వైపు కాలనీవాసులు రాకపోకలు కొనసాగించకుండా ఉంటే తన ప్లాటుకు డిమాండ్ వస్తుందన్న దురద్దేశంతో నాలుగు చోట్ల వదిలిన రస్తాను మూసివేయించాడు.

రూ.20 లక్షల సీసీ రోడ్డు ధ్వంసం

కాలనీ పక్కన ఆహ్లాదకర వాతావరణం కోసం 60 సెంట్లకు పైగా పార్కు కోసం మున్సిపల్ ఓపెన్ సైటును వదిలారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో ఓపెన్ సైటు పక్కనే 100 అడుగులకు పైగా కాలనీవాసులు రాకపోకలకు సీసీ రహదారిని నిర్మించారు. పది సంవత్సరాల నుంచి కాలనీవాసులు ఆ రహదారి వెంట వెళ్తున్నారు. అయితే వారం రోజుల క్రితం రాత్రికి రాత్రే వైసీపీ నాయకుడు సీసీ రహదారిని ఎక్స్‌కావేటర్ల సహాయంతో ధ్వంసం చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఈ విషయాన్ని కాలనీవాసులు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ దృష్టికి తీసుకుపోవడంతో అసిస్టెంట్ కమిషనర్ నేరుగా కాలనీలో పర్యటించి ప్రహరీని పరిశీలించారు. దారికి అడ్డంగా నిర్మించిన ప్రహరిని తొలగించి రహదారి రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలన్నారు. గోడను నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అధికారుల పర్యవేక్షణ తరువాత సీసీ రోడ్డును ధ్వంసం చేశారు.

అధికారం లేకున్నా అదే బరితెగింపు

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అంతో ఇంతో పనులు చేయించుకున్నారు. అధికారం కోల్పోయి 6నెలలు గడిచిన అదే బరితెగింపు కొనసాగిస్తూ ప్రజల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే పార్థసారధి దృష్టి సారించి ప్రహరిని తొలగించడమే కాకుండా సీసీ రహదారిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని సీసీ రహదారిని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీవాసులు వినతి పత్రం ఇచ్చారు

మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చాను. కాలనీవాసులు ఇటీవల వినతి పత్రం ఇచ్చారు. రికార్డులను పరిశీలించి విచారిస్తాం. - కృష్ణ, మున్సిపల్ కమిషనర్


ఆందోళన చేస్తున్న కాలనీవాసులు


ధ్వంసం చేయకముందు సీసీ రోడ్డు

కారు, బైకు ఢీ.. ఒకరి మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు

బనగానపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం పసుపుల తండా సమీపంలో మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో పసుపుల గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు రహిమాపురం మద్దిలేటి(60) మృతి చెందాడు. మరో ఇద్దరు పారిశుధ్య కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. పసుపుల తండా నుంచి ఓ విందు కార్యక్రమంలో పాల్గొని తమ స్వగ్రామం పసుపుల గ్రామానికి మోటారు సైకిల్‌పై రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటిలు బైకుపై వస్తూ పసుపల ప్రధాన రోడ్డుపక్కన ఉన్న గోపాల్‌తో మాట్లాడుతున్నారు. పసుపుల వైపు నుంచి బనగానపల్లెకు వస్తున్న కారు వీరి మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో మోటారు సైకిల్‌పై వస్తున్న రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటిలతో పాటు రోడ్డు మీద నిల్చొని ఉన్న గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని రహిమాపురం మద్దిలేటి, బాలమద్దిలేటి, గోపాల్‌ను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో కోలుకోలేక రహిమాన్‌పురం మద్దిలేటి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ బాలమద్దిలేటి, గోపాల్‌లకు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముగ్గురు పసుపుల గ్రామంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు.

మహిళ మృతి

ఉయ్యాలవాడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన గగ్గెర తొలిశమ్మ(42) విషజ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. తొలిశమ్మ గత కొన్ని రోజులుగా జ్వరంతో బాధ పడుతోందని, స్థానిక వైద్యశాలలో చికిత్స అందిచినా బాగు కాలేదన్నారు. దీంతో శనివారం నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక ఆదివారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు తులిశమ్మకు ముగ్గురు కుమారులు, భర్త ఉన్నారు.

కంది రైతులకు గుడ్ న్యూస్

మార్కెట్ ధరకే కొనాలని ప్రభుత్వ నిర్ణయం




మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కంది పంటను సాగు చేసిన రైతులకు సువర్ణ అవకాశం కల్పించింది. బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే అంతే ధరకు రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం రాజు తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 64,270 హెక్టార్ల మేర రైతులు కంది పంటను సాగు చేశారన్నారు. బహిరంగ మార్కెట్‌లో కందుల ధర ఎక్కువగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటిని రైతుల నుంచి ఆ ధరతోనే కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. దీని వల్ల వ్యాపారుల మధ్య పోటీ పెరిగి మరింత ఎక్కువ ధర లభించే అవకాశం ఉందని డీఎం తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు జిల్లాలో 53వేల టన్నుల కందులను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ ప్రయోజనాలను పొందేందుకు రైతులు తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోకుండా మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలన్నారు. ప్రస్తుతం కర్నూలు జిల్లాలోరైతు సేవా కేంద్రాల్లో కంది పంటను సాగు చేసిన రైతులు తమ పంట వివరాలను వెంటనే రైతు సలహా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు గోనెసంచులతో పాటు కొనుగోలు కేంద్రం నుంచి గోదాముకు చేర్చేవరకు రవాణా ఖర్చులు మార్క్‌ఫెడ్ సంస్థనే భరించడం జరుగుతుందన్నారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి కాటా వేయించి లారీకి లోడింగ్ చేయించేంతవరకు మాత్రమే రైతులు ఖర్చులు భరించాల్సి ఉంటుందన్నారు.

కందుల కొనుగోలుకు నిబంధనలు:

- కందుల్లో ఇతర పంట పదార్థాలు 2 శాతం మాత్రమే ఉండాలి.
- పంట గింజలు 3 శాతం
- దెబ్బతిన్న మరియు కొద్దిగా దెబ్బతిన్న గింజలు కూడా 3 శాతం ఉండాలి
- ఇతర తినగలిగిన ధాన్యాలు ఒక్క శాతం
- విరిగిన పొట్టు లేని గింజలు 3 శాతం
- కలువు పదార్థాలు మూడు శాతం
- తేమ శాతం 12 శాతం
- అపరిపక్వం, ముల్త గింజలు 3 శాతం

పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు

వారంలో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద వారం రోజుల్లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల రైతులు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద అక్రమాలు జరుగుతున్నాయనీ వీటిని అరికట్టేందుకు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో అంశాలపై ఏకీభవిస్తూ హైకోర్టు జడ్జీలు శనివారం సీసీ కెమెరాల ఏర్పాటు కు ఆదేశాలు జారీ చేయడంతో రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 12 కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయడంలో అధికారులు వివిధ మార్గాల్లో నిర్లక్ష్యం చూపుతున్నారని, పత్తి తూకాల్లో తేడా వస్తోందని, ఆ కేంద్రాల వద్ద దళారులు, వ్యాపారులే ఎక్కువగా తిష్ఠ వేసి పత్తి కొనుగోళ్లను తక్కువ ధరకు వారే నిర్వహిస్తున్నారని రైతులు హైకోర్టుకు విన్నవించారు. హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు తమకు ఇంకా రాలేదని, ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు అందిన వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.


పెంచికలపాడు వద్ద పత్తి కొనుగోలు కేంద్రం

ఇద్దరు అంధులకు వెలుగు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ యోగా సేవా సమితి నిత్యసాధకులు శేగు రామసుబ్బయ్య తల్లి శేగు అనసూయమ్మ ఆదివారం ఉదయం స్వర్గస్తులయ్యారు. రామసుబ్బయ్య వెంటనే స్పందించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీకి ఫోన్ చేసి తన తల్లి శేగు అనసూయమ్మ నేత్రాలను దానం చేశారు. ఈ విషయం వెంటనే రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరికి తెలుపగా కర్నూలు నుంచి టెక్నీషియన్లు వచ్చి రెండు నేత్రాలను తీసుకొని హైదరాబాదు ఎల్వీప్రసాద్ ఐ హాస్పటల్‌కు పంపారు. ఈ సందర్భంగా ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ యోగా సభ్యులు గత 20 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇప్పుడు ఆర్గాన్ డొనేషన్‌పై దృష్టి పెట్టి ఇప్పటికి 14 మంది చేత నేత్రదానం చేపించి 28 మందికి అంధులకు వెలుగును ప్రసాదించే దిశగా పయనిస్తున్నందుకు గర్వకారణంగా ఉందన్నారు. ఆనంద్‌గురూజీ ప్రతి ఒక్కరూ కూడ శేగు అనసూయమ్మను వారి కుటుంబ సభ్యులను ఆదర్శంగా తీసుకొని అంధులకు చూపును ప్రసాదించేందుకు తమ వంతుగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దస్తగిరి, తిరుమల రెసిడెన్సీ కాలనీ వాసులు, సుబ్బయ్య, రెడ్‌క్రాస్ ఐ టెక్నిషియన్ ప్రదీప్, సిబ్బంది వరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.


రెడ్‌క్రాస్ సిబ్బందికి నేత్రాలను దానం చేస్తున్న శేగు అనసూయమ్మ కుటుంబసభ్యులు

కాలువలు ఇలా.. నీరు పారేదెలా..!?

(5వ పేజీ తరువాయి)

నిధులు.. నీళ్లు.. ఆశలు:

- కర్నూలు జిల్లాలో ఉన్న ఏకైక అదిపెద్ద సాగునీటి ప్రాజెక్టు తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ). ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు పట్టణాలతో పాటు 195 గ్రామాలకు తాగునీరు అందించే కరువుపల్లె సీమల జీవనాడి. 1955లో ప్రధాన, పంట కాలువలు నిర్మించారు. ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువలు అధ్వానంగా మారాయి. పలు ప్రాంతాల్లో ఆనవాళ్లు కోల్పోయాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. కాలువను పూర్తి స్థాయిలో మరమ్మతులు, పునర్నిర్మాణం చేయాలంటే రూ.350 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు.
- గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో రబీలో 27,500 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు డోన్, పత్తికొండ, కృష్ణగిరి పట్టణాలు, పలు గ్రామాలకు తాగునీరు అందించాలి. వేసవి ఎద్దడి తీవ్రంగా ఉన్న సమయంలో కర్నూలు నగరానికి కూడా ఈ ప్రాజెక్టు నుంచే తాగు నీరు అందిస్తారు. ఎమ్మిగనూరు పట్టణానికి నీటి సరఫరాకు పైపులైన్ పనులు ప్రారంభం అయ్యాయి. కోడుమూరు పట్టణానికి కూడా తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. కాలువ ఆధునికీకరణకు దాదాపుగా రూ.75 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు.
- కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల జీవనాడి కేసీ కాలువ. మూడు జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంటే.. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1.75 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కర్నూలు నగరం, నంద్యాల, నందికొట్కూరు పట్టణాలు సహా వివిధ గ్రామాలకు తాగు నీరు ఆధారం. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వంలో సిప్ కింద ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2021లో సిప్ కింద రూ.563 కోట్లు కావలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింతే.. నిధులు ఇవ్వడానికి ఆమోదం తెలిపారు. ఈ నిధుల్లో 85 శాతం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ), రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 15 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వం 15 శాతం వాటా నిధులు ఇవ్వడానికి ముందుకు రాకపోవడం నిధులు ఆగిపోయాయి.
- నంద్యాల జిల్లాలో 1.90 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన ఎస్సార్బీసీ కాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో 1.55 లక్షల ఎకరాలకే ఆయకట్టు స్థిరీకరించారు. పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గంలో సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించే ఈ కాలువ మరమ్మతులు, అసంపూర్తి పనులు కోసం రూ.270 కోట్లు కావలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. ఈ మొత్తం పెరిగే అవకావం ఉంది.
- తెలుగుగంగ కాలువ ద్వారా ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆత్మకూరు, నంద్యాల, వెలుగోడు, ఆళ్లగడ్డ పట్టణాలు సహా పలు గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటికే 40 కి.మీలు లైనింగ్ పనులు చేశారు. మరో 45-50 కి.మీలు లైనింగ్, పంట కాలువలు ఆధునీకరణ కోసం దాదాపు రూ.250 కోట్లకు పైగా అవసరం ఉందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.


కోసిగి మండలంలో ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్ దుస్థితి

వివిధ ప్రాజెక్టు కింద ఆయకట్టు (లక్షల ఎకరాల్లో), అవసరమైన నిధులు అంచనా సుమారుగా రూ.కోట్లలో

సాగునీటి కాలువ	ఆయకట్టు	కావాల్సిన నిధులు
టీబీపీ ఎల్లెల్సీ	1.51	350
జీడీపీ కాలువలు	0.27	75
కేసీ కాలువ	1.75	563
తెలుగుగంగా కాలువ	1.24	250
ఎస్సార్బీసీ కాలువ	1.55	270
ఆలూరు బ్రాంచి కెనాల్	0.24	50
మొత్తం	6.56 లక్షల ఎకరాలు	రూ.1,558 కోట్లు (అంచనా)

శతాధిక వృద్ధుడి మృతి


సత్యనారాయణ శెట్టి (ఫైల్)

మద్దికెర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మద్దికెర గ్రామానికి చెందిన మెడికల్ మాకం సత్యనారాయణ శెట్టి (101) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మద్దికెర గ్రామంలో 50 ఏళ్లుగా రాధ మెడికల్ జనరల్ స్టోర్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. వందేళ్లకు పైగా ఆరోగ్యంగా ఉంటూ జీవనం సాగించాడు. సత్యనారాయణ మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రిటైడ్ లైబ్రేరియన్ కె.వీరభద్రరావు, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు, టీడీపీ నాయకులు నగిరి కిష్టన్న, గ్రామస్తులు సూర్యప్రకాష్‌రెడ్డి, వన్నాల గోవిందు, ముత్యాల రాజశేఖర్, సుంకు రాజు పూల మాల వేసి నివాళి అర్పించారు.

లారీ దగ్ధం

పాణ్యం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మరాజుపల్లె ఘాట్ రోడ్డులో ఆదివారం తెల్లవారు జామున బేతంచెర్లకు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైనట్లు నంద్యాల అగ్నిమాపక శాఖ అధికారి యోగీశ్వరరెడ్డి తెలిపారు. సమాచారం తెలుసుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశాని చెప్పారు. ప్రమాద సమయంలో డ్రైవర్ మహబూబ్‌బాష ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చైతన్య కుమార్ రెడ్డి, మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం



ఆర్‌యూలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వర్సిటీలోని సెనేట్ హాలులో గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ చిత్రపటానికి గణిత శాస్త్ర అధ్యక్షుడు వెంకట సుందరానంద పుచ్చా పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎం. వీరకృష్ణ, ఎస్‌వీ సునీత యు.నాగిరెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఆచా ర్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **సిల్వర్ జూబ్లీలో..** సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కే.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏ అంశానైతే ఎన్నుకుంటారో దానిపై అంకిత భావంతో చదవినప్పుడే జీవితలో అద్భుతాలు జరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి రామానుజన్‌ను స్ఫూరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్‌లు కే నాగరాజు శెట్టి, మహ్మద్ హయాజ్, అక్తర్ భాను, ఎల్లా కృష్ణ, రాఘవేంద్ర రెడ్డి, బాలక్రిష్ణయ్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి: ఏఐవైఎఫ్


మాట్లాడుతున్న కారుమంచి

కోడుమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం యువత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారుమంచి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీతోపాటు గ్రూపు 1, 2, పోలీసు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశం అనంతరం ఏఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సిద్దు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా అల్తాఫ్, కిషోర్, వీరాంజనేయులు, కిరణ్, సహాయ కార్యదర్శులుగా మల్లి, మునిస్వామి, ఈశ్వరప్ప, కోశాధికారిగా రంగస్వామి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరా ములుగౌడ్, సీపీఐ నాయకులు రాముడు, రాజు, శేషుకుమార్ పాల్గొన్నారు.

నేడు నగర పాలకలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని ఆయన కోరారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పాలక కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంటి వైద్యశిబిరం

ఓర్వకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజు లపల్లె శ్రీరామ రామేశ్వర షిరిడీ సాయిబాబా ఆలయంలో సుశీల నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈశిబిరానికి మండలంలోని సోమయాజులపల్లె, కొమరోలు, చింతలపల్లె, వెంకటాపురం, చెన్నంచెట్టిపల్లె, కాల్వబుగ్గ, పాలకొల్లు, గుడుంబాయి తాండా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కంటి పరీ క్షలు చేయించుకున్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.

జేడీపీ అభివృద్ధికి కృషి

కోడుమూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తానని జేడీపీ అధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్ అన్నారు. ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డి.విష్ణువర్ధన్‌రెడ్డి సహకారం తోనే తనకు గాజులదిన్నె ప్రాజెక్టు అధ్యక్షుడిగా ఎన్నికయ్యానన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, జయనాగేశ్వరరెడ్డి, కేయి శ్యాం బాబులను ఒప్పించి తన కు అధ్యక్షుడి పదవిని ఇప్పించిన ఘనత డి.విష్ణువర్ధన్‌రెడ్డికే దక్కుతుం దన్నారు. విష్ణు, ముగ్గురు ఎమ్మెల్యేలు తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్ష పదవిని అప్పగించారు. వాళ్ల నమ్మకాని కాపాడుకుంటూ ఇటు ప్రజలకు అటు రైతులకు తాగునీరు, సాగునీరు అందిస్తానని అన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

గూడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గూడూరు వెలుగు కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు తెలిపారు. ఈసదస్సులో రైతులు పాల్గొని తమ సమస్యలను అర్జీల ద్వారా సమర్పించాలని సూచించారు.

టీడీపీ కార్యకర్త మృతి


శ్రీనివాసులు (ఫైల్)

కోడుమూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త గొల్ల శ్రీనివాసులు (51) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆలూరు మండ లంలోని బెల్డోణ గ్రామం నుంచి శ్రీనివాసులు తల్లిదండ్రులు ప్యాలకుర్తికి వలస వచ్చి స్థిరపడ్డారు. శీను, భార్య సుజాత ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నారు. అయితే కొన్నేళ్ల క్రితం పొలం కౌలుకు చేసి తీవ్రనష్టాలు మూట గట్టుకున్నారు. అప్పులకు వడ్డీ పెరగడంతో ఇల్లు తాకట్టుపెట్టి కొంతమేర తీర్చాడు. ఇటీవల అప్పులబాధ పెరగడంతో తీవ్రంగా కుంగిపోయాడు. ఈక్రమంలో శీను ఆదివారం ఉదయం అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ కోలుకోలేక సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, కూతూరు, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసులు కుటుంబాన్ని టీడీపీ అధినాయకత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, రాఘవేంద్రయాదవ్, లారీ విజయ్ యాదవ్, రంగన్న యాదవ్, అలీంబాషా, ఆరీఫ్ కోరారు.

29న తైక్వాండో ఓపెన్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు క్లబ్ షటిల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 29న జిల్లా తైక్వాండో ఓపెన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు తైక్వాండో క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. ఈ పోటీలకు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, మంత్రి టీజీ భరత్ హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.అజయ్, ఆర్గనైజర్ టి.తేజ, తైక్వాండో క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లేక.. మురుగు పారక


మురుగు నీటిని దాటుకుంటున్న పోతున్న పాదచారులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయం పక్కనే ఉన్న డ్రైనేజీ పూడికతో నిండిపోవడంతో ఖాళీ స్థలంలో మురుగునీరంతా నిలుస్తోంది. అక్కడ పారిశుధ్య విభాగానికి సంబంధించిన ఓ వాహనం మరమ్మతులకు నోచుకోక అచేతనంగా పడి ఉంది. రోజుకి సుమారు వంద మందికి పైగా నగర పాలక కార్యాలయానికి వస్తుంటారు. అయినా అధికారులు ఎవ్వరు కూడా దీనిని చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో నగర పాలక కార్యాలయ ఆవరణ నుంచి అవుట్‌డోర్ స్టేడియంలోకి వెళ్లే దారి ఇక్కడే ఉంది. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం వాకింగ్ వచ్చే వారంతా మురుగునీరు వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మురుగు కాలువ పూర్తిగా పూడికతో నిండిపోవడంతో నీరంతా బయటికి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాకర్స్ కోరుతున్నారు.


పూడిపోయిన డ్రైనేజీ


నగర పాలక కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు

కళాకారులకు సహకారం అందజేస్తాం

ఎమ్మెల్యేలు గౌరు చరిత, బుడ్డా రాజశేఖరరెడ్డి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారులకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, విద్వాన్ పత్తి ఓబులయ్య రాసిన 'జగదేక సుందరి సామా' పద్యనాటక పుస్తక ఆవిష్కరణ, నాటక ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆధ్యాత్మికవేత్త బీవీ రెడ్డి, నాటక రచయిత పత్తి ఓబులయ్య, మూల కథా రచయిత ఎస్‌డీవీ అజీజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. సామాగా హైదరాబాదుకు చెందిన ప్రముఖ కళాకారిణి సురభి ప్రభావతి, నజ్జికగా తిరుపతికి చెందిన ప్రముఖ కళాకారిణి హసీనా ఎస్‌కే నటించి మెప్పించారు. ఇందులో మాఘ పాత్రలో జీవీ శ్రీనివాసరెడ్డి, భద్రగా వి.రాముడు, ఆర్మగం పిళ్లేగా సంగా ఆంజనేయులు, పోతురాజుగా ఎస్ మహ్మద్ మియా, పుణ్ణకుడిగా పి. రాజారత్నం, ప్రసేనుడిగా కె. బాలవెంకటేశ్వర్లు, భద్రుడిగా గాండ్ల లక్ష్మన్న నటించారు. సంగీతం ఇ. పాండురంగయ్య అందించిన ఈ నాటకానికి కీబోర్డు ప్లేయర్‌గా రాజబాబు వ్యవహరించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు గౌరు చరిత, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ


గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

నాటక అకాడమీ చైర్మన్‌కు సత్కారం: కర్నూలుకు తొలి సారిగా విచ్చేసిన ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను నగర బలిజ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన కళాకారుల సదస్సులో నాటక అకాడమీ చైర్మన్‌ను బలిజ సంఘం నాయకులు మర్యాదపూర్వ కంగా కలిసి శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు వై.నారాయణ రెడ్డి, పత్తి ఓబులయ్య, బలిజ సంఘం నగర అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, నాయకులు ఈశ్వర్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అఖండ పారాయణం ప్రారంభం


గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వేడుకల్లో భాగంగా నగర శివారు మామిదాలపాడులోగల గోదా రంగనాథస్వామి దేవస్థానంలో 7 రోజులపాటు జరిగే అఖండ సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 29 మధ్యాహ్నం 11.45 గంటల వరకు కొనసాగిస్తున్నారు. గోకుల క్షేత్రంలో ఆదివారం ఉదయం పూర్వ ఫల్గుణి నక్షత్రం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. వేకువ జామున 4.30 గంటలకు నిత్య ఆరాధన, శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథస్వామి భోగమూ ర్తులకు, గోదా కృష్ణులు, సాలగ్రామాలకు అభిషేకం, పంచసూక్త పారా యణ, అలంకరణ, తోమాల సేవ, తెలుగు తిరుప్పావై పఠించారు. అనంతరం రంగనాథ, శ్రీలక్ష్మీ, శ్రీగోదాదేవి అష్టోత్తర శతనామార్చనలు చేశారు. సాయంత్రం గోకులం మాడవీధుల్లో అమ్మవారి, స్వామివారి ఉత్సవ మూర్తులతో నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్ర మంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌టీఏ క్యాలెండర్ ఆవిష్కరణ


ఎస్ఎల్‌టీఏ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భాషో పాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవా సలహాదారుడు ఎం.బాలన్న, రాష్ట్ర కార్యదర్శి ఎన్ మద్దిలేటి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు సలీం బాషా, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, గౌరవ సలహాదారుడు తాహేరా హుశేన్ పాల్గొన్నారు.

హాకీ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇవాంజెలికల్ సపోర్టింగ్ టీమ్, ఈఎస్‌టీ కర్నూలు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో హాకీ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డివిజనల్ ఇంజనీర్ ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్ రంగస్వామి హాజరై పోటీలను ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలన్నారు. హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లా డుతూ హాకీ మన జాతీయ క్రీడ అని, కర్నూలులో ఎంతో మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి, ఉద్యోగాలు పొందారన్నారు. ఈ పోటీల్లో బాలురు 8 జట్లు, బాలికలు 4 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.ప్రవీణ్, కమిటి చైర్మన్ జయాకర్, ఫాస్టర్ రాజేష్, ఈఎస్‌టీ సభ్యులు జయపాల్, భాను, రాజు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కబడ్డీ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్య క్షుడు మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాలబా లికల కబడ్డీ జట్ల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. ప్రతిరోజు క్రీడల్లో సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కబడ్డీ కార్యదర్శి రాజశేఖర్, కార్యదర్శి శుభాకర్, సురేష్, అమర్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు విజయ్, గోవింద్, వ్యాయామ ఉపాధ్యాయులు కొండేపోగు చిన్న సుంకన్న, నాగన్న, నాగరాజు, రాగన్న, సుబ్బయ్య, శీలన్న, పితాంబరెడ్డి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

● ముగ్గురికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

కోడుమూరు రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు రహదారిలో వర్కూరు-వేముగోడు గ్రామాల మధ్య శనివారం రాత్రి కారు ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... కర్నూలు వైపు వస్తున్న కారు ముందు వెళ్తున్న వరిగడ్డి ట్రాక్టర్‌ను క్రాస్ చేయబోయి ఢీకొట్టింది. అదే సమయంలో వెనుక వస్తున్న జీపు కారును ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్‌తోపాటు అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. కారు ముందుభాగం నుజ్జు నుజ్జయింది. ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్లు తెలిసింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా క్యాండిల్ లైటింగ్ సర్వీసు



చిన్నారి శృతిని సత్కరిస్తున్న డీఈవో శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీసు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణా నిధిమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్‌పాల్, మెజీషియన్ కేడీజే బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు బోధించిన శాంతి, సమాధానంతో జీవించాలన్నారు. డీఈవో క్యాండిల్స్ వెలిగించి కేక్ కట్ చేశారు. అనంతరం స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన చిన్నారి కే.శృతిని డీఈవో సత్కరించారు. పీఆర్‌టీయూ నాయకులు రవిప్రకాష్, రమణయ్య, బాబురావు, మల్లయ్య, సుదర్శనం, బుగ్గన శ్రీనివాసరెడ్డి, మణి కుమార్, శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


పూడిచెర్లలో ప్రచారం చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిచెర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఇంటింటికీ వెళ్తూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో చింతలపల్లి కమిటీ అధ్యక్షులు, సభ్యులు వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీ.క్యాంపు క్రీడా మైదానంలో క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. 59వ క్రాస్ కంట్రీ పోటీలకు బాలబాలికలకు 6 నుంచి 10 మీటర్లు, బాలికలకు 8-4 కి.మీటర్లు రన్నింగ్ రేస్ నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్+2 కార్యదర్శి సి.హర్షవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 5న తణుకులో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రి పోటీలకు హాజరు కావాలని జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి సుబ్బ రత్నాలు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు లక్ష్మయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ సీనియర్ నాయకులు కే.జగన్నాథం పిలుపుని చ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని కూడళ్లలో పార్టీ జెండాలను ఆవిష్కరించుకుని ఈ నెల 31న బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కే.రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి డి.గిడ్డయ్య హాజరవుతున్నారన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, నాగరాజు, అన్వర్, కుమార్, సోమన్న పాల్గొన్నారు.

నెట్‌బాల్ విజేతలు ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాలు


నెట్‌బాల్ క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర స్థాయి (పది సబ్ జూనియర్ బాలికల) నెట్‌బాల్ విజేతలుగా వెస్ట్ గోదావరి (బాలికలు) ఈస్ట్‌గోదావరి (బాలురు) జట్లు చాంపియన్‌గా నిలిచారు. కర్నూలు డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బాలికల విభాగంలో వెస్టు గోదావరి ప్రథమ స్థానం, విశాఖపట్నం ద్వితీయ స్థానం, క్రిష్ణ తృతీయ స్థానం సాధించాయి. బాలుర విభాగంలో ఈస్ట్ గోదావరి ప్రథమ స్థానం విశాఖపట్నం ద్వితీయ స్థానం, వెస్టు గోదావరి తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు విద్యావేత్త డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ట్రోఫీలు అందజేశారు. జిల్లా నెట్‌బాల్ ప్రతినిధులు నాగేశ్వర బాబు, నాగరత్నమయ్య, సూర్యకుమార్, ఆనంద్, వంశీకృష్ణ, రాజశేఖర్, సుప్రియ చరణ్, గీతాంజలి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు

● ఏటా పెరుగుతున్న జనాభా

● ట్రాఫిక్‌కు తప్పని అంతరాయం

గూడూరు, డిసెంబరు 22: గూడూరు నగర పంచాయతీగా 2011 సంవత్సరంలో ఏర్పడింది. గూడూరు పట్టణ జనాభా దాదాపు 30 వేలకు పైగా ఉంది. నగర పంచాయతీ ఏర్పాటై పదమూడు ఏళ్ళు గడుస్తున్నా పట్టణంలో రహదారుల విస్తరణ ఊసే కనిపించడం లేదు. 2016లో అప్పటి పాలక వర్గం, కమిషనర్ నేతృత్వంలో పట్టణంలో రహదారుల విస్తరణకై సర్వే పనులు చేపట్టారు. ఆక్రమణకు గురైన ప్రాంతాలను గుర్తించి మార్కింగ్ వేశారు. దాదాపు ఏడు, ఎనిమిది ఏళ్ళు కావస్తున్నా విస్తరణ మాట నీటి మీద రాతలాగే మారింది. ఇలా రోజులు మారుతున్న రోడ్డు విస్తరణ మాత్రం కలగానే మిగిలింది.

● **ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడు:** పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఇరుకు రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ తోపుడు బండ్లు నిలిచి ఉండ టంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని వాహనదారులు వాపోతు న్నారు. కర్నూలు-ఎమ్మిగనూరు రహదారితోపాటు, గూడూరు-కోడుమూరు రహదారిలో విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇరుకు రోడ్డులో నిలిచిన వాహనాలు



విద్యుత్ దీపాల వెలుగులో ఆదోని రాయనగర్ ఎంబీ మిస్సా చర్చి



ఎస్‌కేడీ కాలనీలో క్రీస్తు పుట్టుక నమూనా

క్రిస్మస్ సమీపిస్తుండటంతో చర్చిలను అలంకరించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు వెలిగిపోతున్నాయి.
- ఆదోని అగ్రికల్చర్, ఆలూరు.



ఆలూరు సీఎస్ఐ చర్చి..

బంకులను తొలగించి సహకరించాలి

పత్తికొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుబజార్‌లో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని బంకులు తొలగించి సహకరించాలని గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి నరసింహులు కోరారు. ఆదివారం మాట్లాడుతూ రహదారి తోపాటు, ఇరువైపులా మురుగు కాలువలు నిర్మిస్తామన్నారు. ఆక్రమ ణదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. వారే తొలగించు కోని నిపక్షంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బంకులను తొలగిస్తామన్నారు.

తాగునీటి వృథా

మద్దికెర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో మినీ ట్యాంకు వద్ద నీరు వృథాగా పోతోంది. కొళాయి లీకేజీతోనే ఇలా అవుతోందని, మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. ఆదివారం మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ రూ.100లు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా వస్తుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలను నిర్మించామన్నారు. పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, టీడీపీ నాయకుడు బత్తిన వెంకట్రాముడు, మనోహర్ చౌదరి, వెంకటస్వామి, వెంకటపతి, తిరుపాల్ నాయుడు, కృష్ణమూర్తి చౌదరి, డీలర్ సుంకన్న, ప్రతాప్ యాదవ్, జయరాం నాయక్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

వెల్దుర్తి: మండలంలో లక్ష్మంపల్లె గ్రామం సుంకులమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే శ్యాంబాబు పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు మేళతాళాలు, డప్పులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, రామచంద్రుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తుగ్గలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ పిలుపు నిచ్చారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల కమిటీనీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చౌడప్ప, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సూర్యనారాయణ, కార్యదర్శి నాగేష్, ట్రెజరర్‌గా రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మస్తాన్, రామచంద్ర, తలారీ శివ తదితరులు ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

తుగ్గలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులంతా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు సూచించారు. ఆదివారం పెండేకల్ ఆర్ఎస్ సొసైటీలో రైతులతో మాట్లాడుతూ ఈకేవైసీ వేలిముద్ర వేయకపోతే ప్రభుత్వ రాయితీలు అందవన్నారు. క్లర్క్ మధు, రైతులు ఉన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



వెల్దుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

వెల్దుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వెల్దుర్తి పాతబస్టాండ్‌లో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి కృష్ణ రాజు, చిలిపికృష్ణ, వెంకటేశ్వర్లు, చిన్నమాదులు, సుధీర్‌నాయుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక హబ్‌తో జిల్లాకు మహర్దశ

ఆదోని టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ ఏర్పాటుతో జిల్లాకు మహర్దశ వచ్చిందని టీడీపీ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస ఆచారి, బాలాజీ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు 130ఎకరాల విస్తీర్ణంలో రూ.14వేల కోట్ల ఖర్చుతో భారీ సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించడం పట్ల జిల్లా ప్రజలు హర్షిస్తున్నారన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ఆదోని టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని వైసీపీ మున్సిపల్ విభాగాల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో పర్యటిస్తానన్నారు.

సభ్యత్వంతో భరోసా

మద్దికెర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయ అన్నారు. ఆదివారం బొమ్మనపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు రూ.5 లక్షల బీమా పెంచారని గుర్తు చేశారు. రూ.10 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. కన్వీనర్ హుశేన్‌పీరా, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, మనోజ్ కుమార్ ఉన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి నేడు నోటిఫికేషన్

పత్తికొండ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 45 రేషన్ డీలర్ల పోస్టులకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఆర్డీవో భరత్ నాయక్ ఆదివారం తెలిపారు. ఆలూరులో 13, ఆస్పరిలో 4, హాలహర్విలో 5, క్రిష్ణగిరిలో 2, మద్దికెరలో 2, పత్తికొండలో 12, తుగ్గలిలో 4 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 30న సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 5వ తేదీన రాత పరీక్ష, 6న ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ముంచిన వర్షం

- ఆలూరులో తడిసిన మిరప
- పూత రాలిన శనగ
- ఆవేదనలో ఆలూరు, పత్తికొండ రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



ఆలూరు: వర్షానికి తడసిన మిరపను ఎత్తుకుంటున్న రైతు



పత్తికొండ మండలంలో సాగుచేసిన శనగ

ఆలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం అర్ధరాత్రి వర్షం కురవడంతో పంట మునిపోయింది. మనేకుర్తి, కురుకుంద గ్రామాల్లో చేతికొచ్చే సమయంలో నీటిలో మునగడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. వర్షం దెబ్బకు మిరపకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి మరీ సాగు చేశామని, పంట చేతికందే సమయంలో ఇలా అయిందని ఆవేదన చెందుతున్నారు.

రూ.10లక్షల నష్టం

బ్యాంకులో అప్పులు చేసి ఎనిమిది ఎకరాల్లో మిరప సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంట తడిసిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.
- హనుమంతు, మనేకుర్తి

పత్తికొండ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో ఆదివారం కురిసిన అకాల వర్షం శనగకు నష్టం చేసింది. పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. పత్తికొండలో ఆదివారం 5.6 మీ.మీల వర్షం కురిసింది. ఈ వర్షం దెబ్బకు పూత రాలిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రబీ సీజన్‌లో 4,600 హెక్టార్లలో శనగ సాగు చేశారు. మొక్కలు ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందన్న ఆశతో ఉన్న రైతులు అకా వర్షం దెబ్బకు దిగాలు చెందుతున్నారు.

మంచి దిగుబడి వస్తుందనుకున్నా

నాకున్న మూడెకరాల్లో శనగ సాగు చేశారు. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పంట ఏపుగా పెరిగింది. దీంతో మంచి దిగుబడి వస్తుందని ఆశించాను. అయితే ఆదివారం కురిసిన అకాల వర్షంతో పూత రాలిపోయి పంట దెబ్బతింది. పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశముంది. **- నర్సప్ప, రైతు పెద్దహుల్తి.**

●ఏవో వెంకటరాముడును వివరణ కోరగా.. శనగ రైతులు 191919 రకం ఫర్టిలైజర్‌ను పంటపై పిచికారి చేస్తే పంట దెబ్బతినకుండా దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

ఆలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ భవన్ ముందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు వివాదంగా మారింది. రెండు రోజుల క్రితం వైసీపీ నాయకులు అంబేడ్కర్ భవన్ ముందు ఏర్పాట్లు చేయగా, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు నరసప్ప, గాదిలింగ, కొమ్ము రామాంజినేయులు, రాజు, మసాలా జగన్, బెట్టింగ్ రాజ్, గోవింద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ విగ్రహం పెట్టేందుకు అంగీకరించబోమని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి జోక్యం చేసుకుని వైఎస్సార్ విగ్రహం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరారు. అయితే కోయనగర్ టర్నింగ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేయాలని దళిత సంఘం నాయకులు సూచించారు. ఇందుకు ఎంపీపీ రంగమ్మ తనయుడు వీరేష్, మాజీ ఎంపీటీసీ పెట్రోల్ బంక్ కిషోర్, కన్వీనర్ వీరేష్ అంగీకరించలేదు. దీంతో దళిత సంఘం నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

డైరెక్టర్‌కు సన్మానం

పత్తికొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాతపేట వాల్మీకి ఆలయంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామక్రిష్ణను ఆదివారం సన్మానించారు. ఆస్పరి నరేంద్ర, టైలర్ రంగన్న, సిద్దరాముడు, చెన్నయ్య, తిరుపాల్ ఉన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ న్యూ జనరేషన్ యాక్టివిటీస్ 2024-25 జోనల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేతో పాటు రోటరీ క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ చిన్నపురెడ్డి, అసిస్టెంట్ గవర్నర్ దశరథ రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, సహాయ కార్యదర్శి సునీల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వాన్ని లభిస్తాయని, ఉద్యోగాశాలు కూడా పొందవచ్చన్నారు. ఈ పోటీల్లో 40 పాఠశాలల నుంచి 1500మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఫుట్‌బాల్, త్రో బాల్, కబడ్డి, డాడ్జ్ బాల్, అథ్లెటిక్, కోకో, టెన్ని కాయిట్ పోటీలలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రాజేష్ జైన్, శ్రీధర్ రెడ్డి భరత్ షా, ప్రశాంత్ గాంధీ, సుబ్బయ్య, బసవరాజు, వీరేష్, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, నితిన్, శివరాం, హుస్సేన్ పాల్గొన్నారు.



క్రీడా జ్యోతితో ఎమ్మెల్యే పార్థసారథి

దారి కష్టాలు

నిలిచిన ఎన్‌హెచ్ 167 పనులు
ప్రమాదాల బారిన వాహనదారులు



కంకర తేలిన జాతీయ రహదారి



ఆలూరు పట్టణంలో జాతీయ రహదారి దుస్థితి

ఆలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పట్టణం మీదుగా చేపట్టిన జాతీయ రహదారి 167 పనులు ఆగిపోయాయి. దీంతో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారి పనులను 2017లో ప్రారంభించారు. 50కిమీ పరిధిలోని హాలహర్వి మండలం చింతకుంట నుంచి ఆలూరు మీదుగా బళ్లారికి వెళుతుండగా, మరోవైపు మంత్రాలయానికి వెళుతుంది. అయితే మిగతా ప్రాంతాల్లో పనులు పూర్తికాగా, ఆలూరు, హాలహర్వి మండలాల్లో మాత్రం పెండింగ్ పడ్డాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నాయి. ఈ రోడ్డుపై నిత్యం 500పైగా భారీ వాహనాలు వెళుతుంటాయి. టోల్ గేట్ నిర్మాణం వద్ద పనులు ఆగిపోయి, పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఏడాది క్రితం ఓ విద్యుత్ ఉద్యోగి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామీణ నీటి సరఫరా కార్యాలయం నుంచి కొంత దూరం వరకు రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. భారీ వాహనాలు వెళ్తుండడంతో దుమ్ము ధూళికి గురై వ్యాపారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు.

సగం మధ్యలో వదిలేశారు

స్థానిక వాసవి కల్యాణ మండపం నుంచి కొంత దూరం వదరకు సగం రోడ్డు వేసి వదిలేశారు. అలాగే రోడ్డు ఎత్తుగా ఉండటంతో వాహనాలు అదుపు తప్పి చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కొత్త బస్టాండు నుంచి కి.మీ మేర వేసిన దారి కూడా ఇలాగే ఉంది. రోడ్డు మధ్యలో డివైడర్ల ఏర్పాటుకు ఖాళీ స్థలం వదిలారు. అయితే డివైడర్లను ఏర్పాటు చెయ్యలేదు. దీంతో ఎప్పుడు ఏ వాహనం వస్తుందోనని చోదకులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

ఆలూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
- శంకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నేషనల్ హైవే కర్నూలు

శ్రీనివాస రామానుజన్ జయంతి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి ఆదివారం మిల్టన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి కరస్పాండెంట్ రమేష్ బాబు ప్రిన్సిపాల్ నాగరాజు నివాళి అర్పించారు. 12ఏళ్ల వయసులోనే అసాధారణ ప్రతిభగల బాలుడిగా గుర్తింపు పొందారన్నారు. గణితం సులువని విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తిలో విద్యార్థులు గణితంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, సుశీలా, లావణ్య, జయసింహ, ఇబ్రహీం పాల్గొన్నారు. అలాగే భాష్యం పాఠశాల రెండవ బ్రాంచిలో ప్రశాంత గణిత ఉపాధ్యాయుడు ఎన్ రామయ్య, ప్రిన్సిపాల్ రవి ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు పాల్గొన్నారు.



మిల్టన్ పాఠశాలలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్టీలో చేర్చే వరకు పోరాడతాం



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

తుగ్గలి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్టీలో చేర్చేవరకు వాల్మీకులు పోరాడాలని వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, టీడీపీ నాయకురాలు ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుడిసె కృష్ణమ్మ అన్నారు. ఆదివారం మండ లంలోని మారెళ్ల గ్రామంలో బీవీఎస్ అధ్యక్షుడు అంజి ఆధ్వర్యంలో వాల్మీకి పల్లె గర్జన బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మానించినా కేంద్రం ఆమోదం తెలపలేదని, ఢిల్లీ వరకు వెళ్లి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కృషి చేద్దామని పిలుపు నిచ్చారు. బ్రిటీష్ కాలం నుంచి వాల్మీకులతో పనులు చేయిస్తున్నారే తప్ప అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చేందుకు 2017 లోనే సీఎం చంద్రబాబు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపారని ఢిల్లీ పెద్దలు ఆమోదం తెలపక పోవడంతో పెండింగ్ ఉంద న్నారు రామాంజనేయులు, బీవీఎస్ గౌరవాధ్యక్షుడు మద్దిలేటి, టీడీపీ కార్యదర్శి వలసల రామకృష్ణ పరుశురా ముడు, రాంభీమ్, తిరుపాల్ నాయుడు, వీవీఆర్ వెంకట్రాముడు, రామచంద్ర, చిరంజీవి, తలారి రాముడు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు పరిశీలన



బసాపురంలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసాపురం ప్రజలు తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఎల్ఎల్‌సీ చైర్మన్ రామస్వామి కలెక్టర్ రంజిత్ బాషకు విన్నవించారు. దీంతో కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదివారం బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. పాడైన ఫిల్టర్ బెడ్‌ల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించి కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ, ఆర్ఐ, వీఆర్‌వో పాల్గొన్నారు

రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రేషన్ డీలర్ల పోస్టులకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు నేరుగా లేదా రిజిస్టర్ పోస్టులో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఆదోని అర్బన్-19, ఆదోని రూరల్-13, గోనేగండ్ల 3, హోళగుంద 2, కోసిగి-10, కౌతాళం-4, మంత్రాలయం 12, నందవరం -2, పెద్దకడబూరు-9, ఎమ్మిగనూరు రూరల్-6 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

ఆదోనిలో సినీ తారల సందడి



సినిమా టైటిల్‌ను విడుదల చేస్తున్న నిర్మాత విశ్వప్రసాద్, ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని/ అగ్రికల్చర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో సినీతారలు ఆదివారం సందడి చేశారు. పట్టణానికి చెందిన సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సమర్పణలో గరివిడి లక్ష్మి సినిమా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి క్లాప్ కొట్టి షూటింగ్ ను ప్రారంభించారు. సీనియర్ నటుడు నరేష్‌తో పాటు నిర్మాత టీజీ విశ్వప్రసాద్, డైరెక్టర్ గౌరీ నాయుడు, నటులు రాగ మయూర్, ఆనందితో పాటు ఎమ్మెల్సీ మధుసూధన్, జనసేన నాయకుడు మల్లప్ప పాల్గొన్నారు.

ముంచుతున్న ముసురు

ఆందోళనలో మిరప రైతులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చేటుచేసుకుంది. చిన్నపాటి జల్లులతో పాటు ముసురు కమ్మేయటంతో మిరపరైతులు తీవ్ర ఆందోళనకు గురువుతున్నారు. మిరపను ఆరబోసుకున్న రైతులు పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వేల రుపాయలు వెచ్చించి సాగుచేసిన పంట చేతికొచ్చి ఒకటి రెండు రోజుల్లో మార్కెట్‌కు తరలించే సమయంలో ఇలా ముసురు కప్పి ముంచేయడం మిరపరైతును కష్టాల్లోకి నెట్టినట్లైంది. ఎమ్మిగనూరు వ్యసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో 17,125 ఎకరాల్లో రైతులు వివిధ రకాల మిరపపంటలను సాగుచేశారు. పంట సాగుకోసం ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.50లక్షల వరకు ఖర్చు చేశారు. మొదటి కోత, రెండో కోత కోసి పొలాల్లోను, కల్లాలోను ఆబోసుకున్నారు. మిరప ఎండుతున్న సమయంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో చిన్నపాటి వర్షాలు పడటంతో పాటు ముసురు కమ్మేయడంతో మిరప పంట ఆరటం కష్టతరంగా మారింది. రెండు మూడు రోజులుగా ముసురు ముచ్చుకోవటంతో రోజు పంటపై టర్పాలిన్లు కప్పుకుంటూ కాపాడుకుంటున్నారు. ముసురుతో మిరప పంట ఆరకపోవటమేగాక మెత్తబడి రంగు మారుతోంది. ఈ ప్రభావం ధరపై పడుతుండటంతో రైతులు తీవ్ర ఆవేధనకు లోనవుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో మిరపకు ఆశించిన స్థాయిలో ధరలు పలకడం లేదు. గత ఏడాది అమ్ముకున్న ధరలకన్నా దాదాపు ఐదారు వేలు తక్కువగానే పలుకుతోంది. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట దెబ్బతిని ధర పతనమైంది. ఇది చాలదన్నట్లు ఇప్పుటు వర్షాలు, ముసురు కమ్మేయటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.


ఎమ్మిగనూరులో మిరప పంటపై కప్పిన పట్టలు


మెత్తబడిన మిరపను చూపుతున్న రైతు

మిరప రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రతిసారి ఏదో రకంగా మిరపరైతులు నష్టాల పాలవుతున్నారు. గత ఏడాది ధరలు లేక నేటికి అలాగే గోడౌన్లలో పెట్టారు. ఈ ఏడాదైన మిరపకు మంచి ధర వస్తుందని ఎంతో ఆశతో రూ. లక్షలు పెట్టి సాగుచేస్తే పంట చేతికొచ్చే సమయంలో వర్షం రావటంతో తడిసి రంగు మారుతోంది. వ్యాపారలు ఈ మిరపను కొనేందుకు ముందుకురారు. ఏదో ఒక రేటుకు ఇచ్చి రావాల్సిన పరిస్థితి. ప్రభుత్వం మిరపకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలి.

- సోమేష్, రైతు, వెంకటాపురం

ముసురుతో రంగు మారి ధర తగ్గుతుంది



ఎకరన్నర పొలంలో డీలక్స్ రకం మిరప పంటను సాగుచేశాను. ఇందుకుగాను అప్పు చేసి రూ. 1.50లక్షలు ఖర్చు చేశా. పంట ఆరబెట్టుకున్న సమయంలో ఇలా ముసురు ముచ్చుకుంది. పంట ఆరకపోగా రంగు మారుతుంది. దీంతో ధర భారీగా తగ్గే అవకాశం ఉంది. ఏమి చేయాలో అర్థం కావటం లేదు. అప్పులు ఎలా తీర్చాలో తెలియదు.

- రంగన్న, రైతు, ఎమ్మిగనూరు

చెక్‌పోస్టులో అప్రమత్తంగా ఉండాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు


మాధవరం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

మంత్రాలయం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం రాష్ట్రంలోకి రాకుండా అరికట్టేందుకు చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం మాధవరం చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రికార్డులను సీసీ కెమెరాల పనితీరు కర్ణాటక మద్యం సరఫరా వంటి వాటిపై ఆరా తీశారు. అనంతరం సీసీ కెమెరాలు జిల్లా, రాష్ట్ర కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చెక్‌పోస్టులో పని చేసే సిబ్బంది సీసీకెమెరాలతో గస్తి ఏర్పాటు చేయాలన్నారు. తనిఖీల్లో ఎమ్మిగనూరు ఎక్సైజ్ ఎస్‌ఐ ఇస్మాయిల్, బీఎంపీపీ సీఐ మొహిద్దీన్ బాషా, చెక్‌పోస్టు సీఐ చంద్రశేఖర్ నాయుడు ఉన్నారు.

నేడు డీలర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నందవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాళీగా ఉన్న రెండు డీలర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ రానున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మండలం లోని గంగవరం ఒకటి, నందవరం ఒకటి పర్మినెంట్ డీలర్లను ప్రభుత్వం నియమించనున్నట్లు పేర్కొన్నారు. డీలర్ల ఎంపికకు రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందపరచిన నిబంధనల ప్రకారం అర్జీలను ఆదోని సబ్‌కలెక్టర్, రెవె న్యూ డివిజన్ అధికారుల కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్జీ నమూనా తహసీల్దారు కార్యాలయంలో తీసుకోవాలన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం మండలానికి 11 చౌకదుకాణ డీలర్ల పోస్టులు మంజూరైనట్లు తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. ఇందులో ఖగ్గల్లు, చెట్నహళ్లి, సుంకేశ్వరి, వగరూరు, రచ్చుమర్రిల్లో ఐదు పోస్టులు ఖాళీలు ఉన్నాయని, బియ్యం కార్డులు ఉండటంతో అదనంగా కాచాపురం, మాధవరంలో రెండు, రచ్చుమర్రి, బూదూరులో కొత్త చౌక దుకాణాలు మంజూరయ్యాయని తెలిపారు. వీటికి ఆసక్తి, అర్హత ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆరు కొత్తగా రేషన్ షాపులకు సోమవారం నోటిఫికేషన్ జారీ కానున్నట్లు సీఎస్‌డీటీ మహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎర్రకోటలో-2, కడిమెట్లలో-2, పార్లపల్లితో పాటు ఏనుగుబాలలో ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. వీటికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి విరాళం


పరిమళ పాఠశాలకు విరాళం ఇచ్చిన సుబ్బనరసింహకు మెమెంటో ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరు చెందిన దాత సుబ్బనరసింహ రూ.1.50లక్షలు విలువ చేసే ఫిజిక్స్ కెమిస్ట్రీ, క్రీడా వస్తువులు, పరిమళ పాఠశాల, శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలకు విరాళం ఇచ్చారు. అదే విధంగా బెంగుళూరు చెందిన గుండురావు రూ.లక్ష , హైదరాబాదుకు చెందిన రాఘవేంద్రరావు గోసంరక్షణకు రూ.లక్ష విరాళం ఇచ్చారని మఠం ఏఏవో మాధవ శెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషీ తెలిపారు. ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిమళ పాఠశాల, శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలకు భౌతిక రసాయన శాస్త్రాల పరికరాలు, క్రీడా పరికరాలను పరిశీలించి దాతలకు అభినందనలు తెలియజేశారు. దాతలకు పీఠాధిపతి శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, మెమెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేష్ కోనాపూర్, ఏవో వీరన్న, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్, సుజీంద్రాచార్‌లు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

కోసిగి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి పంచా యతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మదేవి ఆలయ సమీపంలోని మైదానంలో ఓ అనాథ వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకన్న సర్పంచ్ కుమారి అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో అనాథ శవాన్ని పంచాయతీకి సంబంధించిన ట్రాక్టరులో సిబ్బంది, కార్మికులు హిందూ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు చేశారు. మృతి చెందిన అనాథ వ్యక్తి ఆధారాలు లేకపోవడంతో పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రజా పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రజాపరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి కోరారు. ఆదివారం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పరిష్కార వేదికను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, రైతులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

కె.నాగలాపురంలో గుడిసె దగ్ధం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామంలో గుడిసె దగ్ధమైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దేవదాసు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దాంతో గుడిసెకు నిప్పంటుకొని నిత్యావసర వస్తువులతో పాటు సామగ్రి కాలిబూడిదయింది. గ్రామస్థులు, స్థాని కులు స్పందించి మంటలను ఆర్పివేశారు. బాధితునికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రాజగోపురాలకు రంగులు

కౌతాళం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయలంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 1,2,3వ తేదీల్లో జరగు కుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. గోపురాలకు రంగులు వేస్తున్నారు. తూర్పు రాజగోపురానికి రంగులు వేయడంతో కొత్త శోభసంతరించుకున్నది. కుంభాభిషేకం కార్యక్రమాలకు దిగ్విజయంగా కొనసాగేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు.


తూర్పు రాజగోపురం

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు


నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై ఊరేగారు. ధనుర్మాసంలో భాగంగా ఆదివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో తుంగభద్ర నది తీరాన అశేఖ భక్త జనవాహిని తరలిరావడంతో మంత్రాలయం భక్తులతో కిక్కిరిసింది. ప్రధాన రహదారులపై రోడ్లన్నీ వాహనాలు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరిస్తుండగా.. భక్తులు జయజయధ్వానాలు పలికారు. అనంతరం ఊంజల సేవ చేసి పీఠాధిపతి భక్తులను ఆశీర్వదించారు.

పెద్దకడుబూరులో పులి జాడల గుర్తింపు


పులిజాడలను నమోదు చేసుకుంటున్న అటవీశాఖ అధికారి

పెద్దకడుబూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు పొలాల్లో పులి అడుగు జాడలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. మండల కేంద్రంలోని 76 కాలువ సమీపంలోని పొలాల్లో వారం రోజులుగా చిరుత సంచారం చేస్తున్నట్లు రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆదివారం అటవీశాఖ అధికారులు మిరప పొలాల్లో తిరిగి చిరుత అడుగు జాడలను గుర్తించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు తెలియజేశారు.

ప్రజా సేవ కోసమే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్

ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించిన పురుషోత్తంరావు


మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ జీఎం పురుషోత్తంరావు

మంత్రాలయం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో భాగంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ విశేష సేవలు అందిస్తుందని ఆ కమ్యూనిటీ జనరల్ మేనేజర్ జూపల్లి పురుషోత్తంరావు తెలిపారు. ఆదివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకే ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎస్ఐ చర్చి నాయకులు దేవమణి, బొజ్జప్ప, హుశేనీ, యేసేబు, ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

ట్యాంకరు ఢీకొని వ్యక్తి మృతి

మంత్రాలయం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాటర్ ట్యాంకరును ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మాలపల్లి సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ మజ్జిగ నాగేంద్ర (35) అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై భార్య పుట్టినిల్లయిన చింతకుంట గ్రామానికి వెళ్తుండగా మాలపల్లి సమీపంలో ఆగి ఉన్న ట్యాంకరను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల భాగం నుజ్జునుజ్జయింది. విషయం తెలుసుకున్న మాధవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

స్వగ్రామాలకు వలస కూలీలు

● పండుగలు, దేవరలే కారణం
● కళకళలాడుతున్న గ్రామాలు


నాలుగు నెలల తరువాత సొంత గ్రామాలకు చేరిన వలస కూలీలు

గోనెగండ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బతుకు జీవుడా అంటూ కడుపు చేతపట్టుకొని గ్రామాల నుంచి వలస వెళ్లిన కూలీలు పండుగలు, దేవరలు రావడంతో రెండు, మూడు రోజులుగా సొంత గ్రామాలు చేరుతున్నారు. ఇప్పటికే గోనెగండ్ల, గంజహళ్లి, బైలుప్పల, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, తిప్పనూరు, వీరంపల్లి గ్రామాలను వలస కూలీలు చేరారు. దాదాపు మండల వ్యాప్తంగా 6వేల నుంచి 8వేల మంది కూలీలు సొంత గ్రామాలను చేరినట్లు తెలుస్తుంది. దీంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. రాత్రిపూట వీధుల్లో అరుగులపై పిల్లపాపలు, పెద్దలు కూర్చొని బతుకు తెరువు కోసం వెళ్లిన ప్రాంతాలలో జరిగిని విశేషాలను తమ తోటి వారితో పంచుకుంటు కాలక్షేపం చేస్తున్నారు. క్రిస్టమస్, నూతన సంవత్సరం వేడుకలు, సంక్రాంతి, పెళ్లిళ్లు, దేవరలు, జాతరలు రావడమే కారణంగా చెబుకుంటున్నారు. దీంతో కిరాణం దుకాణాలు, బట్టల దుకాణాలు, తెల్లవారుజామున హోటళ్లు వ్యాపారంతో కళకళలాడుతున్నాయి.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులు పొందారు. జడ్జీ వెంట మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం అర్చకుడు రాజన్న, గ్రామ పెద్దల ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ముందుగా స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక హో మాలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు గ్రామ పెద్దలు అన్నదానం చేశారు.

గ్రామాల్లో మొదలై క్రిస్మస్ సందడి


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

గోనెగండ్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం క్రిస్మస్ సందడి మొదలైంది. క్రిస్మస్‌ను పురస్కరించుకొని మరియమ్మ, బాలఏసు, దూతల వేషధారణలతో చిన్నారులు అలరించారు. గ్రామంలోని పలువీధుల్లో తిరిగి క్రీస్తు గొప్పతనం, ఆయన మానవళికి సూచించిన బోధను వివరించారు. కార్యక్రమంలో తిమోతిపాల్, కేరల్ కాంతమ్మ, కావళి, జయకాంత్, సురేఖ, సౌభాగ్య, పిల్లలు పాల్గొన్నారు.


తమిళనాడులోని ఈరోడ్‌లో ఓమిని టెక్స్‌టైల్ పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఈ రోడ్డులో టెక్స్‌టైల్ పార్కు పరిశీలన

పార్కు నిర్వహణపై సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే బీవీ చర్చలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుకు సంబంధించి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదివారం తమిళనాడులోని ఈ రోడ్‌లో ఉన్న మినీ టెక్స్‌టైల్ పార్కులను చేనేత,జౌళిశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ రోడ్ ప్రాంతంలో ఉన్న మైలి మినీ టెక్స్‌టైల్ పార్కులో వస్త్రతయారి యంత్రాలను, డైయింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌లతో పాటు పలు విభాగాలను పరిశీలించారు. అలాగే టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్న చీరలను, ఇతర వస్త్రాలను పరిశీలించారు. మగ్గంపై కూర్చొని కొద్దిసేపు నేశారు. అలాగే ఆ సంస్థ వ్యవస్థాపకులు వీకే జగన్నాథన్‌తో మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణంలోని టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు ఉన్నాయని తెలిపారు. ఎమ్మిగనూరులో పారిశ్రామిక వేత్తలు, టెక్సల్ పార్కు నిర్వాహకులు పర్యటించాలని ఎమ్మెల్యే కోరారు. ఇందుకు వారు సమ్మతించారు. కాగా ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతుండటంతో చేనేతల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.


మగ్గం నేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూసమస్యలు పరిష్కరించేందుకు కృషి

తహసీల్దారు శ్రీనివాసులు



నందవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం తహసీల్దారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: భూ సమస్యలు పరిష్కరించేందకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మండలంలో భూ సమస్యలే అధికంగా ఉన్నాయి. సమస్యల పరిష్కరం కోసం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో వీఆర్వోలు, సర్వేయర్లుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించాం. ఇబ్బందికర పరిస్థితులుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని గ్రామాల్లో భూ సర్వే జరిగింది?

జవాబు: మండలంలోని 24 గ్రామాల్లో భూ సర్వే చేయిస్తున్నాం. ఇంకా కొన్ని గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. ఎక్కువగా కుటుంబంలోని అన్నదమ్ముల ఆస్తులకు జాయింట్ ఎల్‌పీ ఇవ్వడంలో సమస్యలు వస్తున్నాయి. అలాంటి వాటిని సబ్ డివిజన్ చేసి సమస్యలను పరిష్కరిస్తాం. కొంత మంది రైతులు గట్లు విషయం దగ్గర తమకు పొలం వస్తుందని ఘర్షణ పడుతున్నారు. ఇద్దరి రైతులకు నచ్చజెప్పి సరిచేస్తున్నాం.

ప్రశ్న: పాసుపుస్తకం కోసం కొంత మంది డబ్బులు అడుగుతున్నారంటా?

జవాబు: దరఖాస్తు చేసుకున్నా వెంటనే ఆన్‌లైన్‌లో వస్తుంది. తర్వాత 40 రోజులకు పాసుపుస్తకం నేరుగా రైతు ఇంటికే వస్తుంది. పాసు పుస్తకం కోసం రైతులు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. మధ్య దళారులను నమ్మొద్దు.

ప్రశ్న: రేషన్ బియ్యం తీసుకోకపోతే కార్డు రద్దు చేస్తారా?

జవాబు: ప్రతి నెల 17వరకు రేషన్ బండ్లు ఇళ్ల దగ్గరకి వచ్చి రేషన్ సరఫరా చేస్తాయి. ఒకవేళ రేషన్ తీసుకోకపోయినా కార్డు రద్దు కాదు. లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లితే అక్కడే రేషన్ తీసుకోవచ్చు.

ప్రశ్న: నాగలదిన్నెలో పట్టాల పంపిణీ ఎప్పుడు చేస్తారు? కబ్జాకు గురైన పట్టాలు రికవరీ చేస్తారా?

జవాబు: నాగలదిన్నె వరద కాలనీలో దాదాపు 2000 పట్టాలు ఉన్నాయి. దాదాపు లబ్ధిదారులకు ఇచ్చాం. అయితే అందులో కొంత మంది వలస వెళ్లడంతో కొన్ని పట్టాలు కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చింది. పట్టా నెంబర్లను సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు అందజేస్తాం. కబ్జాకు గురైన పట్టాలు రికవరీ చేస్తాం.

అకాల వర్షం.. అపార నష్టం

● చింతకుంటలో వర్షానికి నేలకొరిగిన పంటలు
● తడిసిన సజ్జ, మిరప


చింతకుంటలో నేలకొరిగిన సజ్జ పంట

కోసిగి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన సజ్జ, జొన్న, మిర్చి పంటలు నేలకొరిగాయి. చింతకుంట గ్రామానికి చెందిన కౌలు రైతు మాన్వి నాగరాజురైతుకు చెందిన రెండెకరాల సజ్జ పంట నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే గ్రామంలోని ఎండుమిర్చి ఆరబెట్టిన రైతులకు అపార నష్టం వాటిల్లింది. మిర్చి పంట పూర్తి తడిసిపోవడంతో నల్లబారిపోతుందని ఆయా రైతులు ఆవేదన చెందుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మంత్రాలయం: మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు కురిసిన అకాల వర్షానికి మిరప రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లంలో ఆరబెట్టిన మిరపను కాపాడేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. కోసిన వరి రైతులకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. కల్లాలో మిరప కుప్పల్లో నీ రు చేరింది. పంటంతా పాడై రంగు మారి పోయి ధర తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


వర్షానికి తడిసిపోయిన మిరప